పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ప్రతిమ హోటల్‌లో ఆకస్మిక తనిఖీలు

- అట్టపెట్టెల్లో దాచిన 6.67 కోట్ల నగదు స్వాధీనం
- ఐటీ అధికారులకు అప్పగించిన పోలీసులు

రాంనగర్, మార్చి 16: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిమ హోటల్‌లో శనివారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శుక్రవారం రాత్రి నుంచే మాటు వేసిన సుమారు 30 మంది పోలీసు అధికారులు అర్ధరాత్రి దాటిన తర్వాత ఏకాలంలో హోటల్‌ను చుట్టుముట్టి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో హోటల్ సెల్లార్‌లోని అకౌంట్స్ కార్యాలయంలో అట్ట పెట్టెల్లో దాచి ఉంచిన నగదును గుర్తించారు. వాటిని తెరిచి చూడగా సుమారు రూ.6,67,32,050 నగదు కనిపించింది. సుమారు ఆరు గంటలపాటు జరిగిన ఈ తనిఖీల్లో నగదును లెక్కించి హోటల్ సిబ్బందిని ప్రశ్నించారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. తనిఖీలపై టౌన్ ఏసీపీ నరేందర్ మీడియాతో మాట్లాడారు. నగదుకు సంబంధించిన ఆధారాల కోసం హోటల్ మేనేజర్ రాఘవేంద్రబాబును వివరణ కోరగా.. సరైన సమాధానం చెప్పలేదని, పట్టుబడిన నగదును వీడియో చిత్రీకరించి సాక్షుల సమక్షంలో పంచనామా చేసినట్టు తెలిపారు. ఐటీ అధికారులకు సమాచారం అందించి వారికి నగదును అప్పగించామని ఏసీపీ తెలిపారు.

కోడ్ కూత 80 రోజులు

అమల్లోకి వచ్చిన ఎన్నికల నిబంధనలు • కొత్త పథకాలు, కార్యక్రమాలకు బ్రేక్

- మే 13న ఒకే దశలో రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికలు
- కంటోన్మెంట్ స్థానానికీ బై ఎలక్షన్
- ఫలితాలకు 20 రోజుల ఎదురుచూపు
- రాష్ట్రంలో 3.30 కోట్ల మంది ఓటర్లు
- మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలు
- విధుల్లో 2 లక్షల ఎన్నికల సిబ్బంది
- కలెక్టర్లతో సీఈవో వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయటంతో శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. జూన్ 6న కోడ్ పూర్తవుతుంది. అంటే.. మొత్తం 80 రోజుల పాటు రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలో మే 13న ఎన్నికలు పూర్తవుతున్నా, జూన్ 4న ఓట్లను లెక్కించనున్నారు. రాష్ట్రం లో మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో రెండు ఎస్టీ, మూడు ఎస్సీ రిజర్వ్‌డ్. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 3.30 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 35,356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పోలింగ్ బూత్ స్థాయి మినహా ఇతర అధికారులకు శిక్షణను పూర్తి చేశారు. ఈవీఎంల మొదటి దశ చెకింగ్ పూర్తయింది.

కోడ్ నిబంధనలు ఇవీ..

- కోడ్ సమయంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లను వినియోగించుకోవడానికి వీల్లేదు.
- కొత్త పథకాలను ప్రారంభించవద్దు.
- ఎన్నికల సంఘం అనుమతి లేకుండా ఎన్నికల అధికారులను బదిలీ చేయరాదు.
- ప్రభుత్వ యంత్రాంగాన్ని, అధికారులను, వాహనాలను వాడటానికి వీల్లేదు.
- ప్రభుత్వ స్థలాలు, కాలేజీలు, స్కూళ్లను ప్రచారానికి వినియోగించుకోవాల్సి ఉంటే రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలి.
- రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లే వారు తప్పనిసరిగా ఆధారాలు తీసుకెళ్లాలి. లేకుంటే నగదును సీజ్ చేస్తారు.
- బంగారం, వెండి ఆభరణాలకు కూడా సరైన ఆధారాలు చూపించాలి.
- మద్యం రవాణాపై ఆంక్షలు ఉంటాయి.
- మీడియాలో రాజకీయ పార్టీలు, వ్యక్తులకు అనుకూలంగా, పక్షపాతంగా ప్రచార కథనాలపై నిషేధం.
- ఓటర్లను ప్రభావితం చేసేలా కుల, మతపరమైన వ్యాఖ్యలు చేయకూడదు. వదంతులు వ్యాప్తి చేయొద్దు. ఓటర్లకు డబ్బులు పంచడం, భయపెట్టడానికి వీల్లేదు.
- ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక అభ్యర్థుల ఆర్థిక గ్రాంట్లు ప్రకటించడం నిషేధం.
- ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థలలో తాత్కాలిక నియామకాలు చేపట్టకూడదు.
- ఎన్నికల్లో పోటీ చేసే మంత్రులు లేదా అభ్యర్థులు తమ పరిధిలోని నిధులను మంజూరు చేయకూడదు.
- అభ్యర్థులు రాజకీయ నాయకుల సమావేశాలకు మున్సిపాలిటీ బహిరంగ ప్రదేశాల్లో మీటింగులకు ఉచిత ప్రవేశం కల్పించాలి.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ఉండకూడదు. రాజకీయ నేతల పోస్టర్లు, కటౌట్‌లు, హోర్డింగులు తొలగించాలి.
- ఎన్నికల అధికారులు, సిబ్బంది బదిలీలపై పూర్తిగా నిషేధం. మంత్రులు, రాజకీయ నేతలతో అధికారుల వీడియో కాన్ఫరెన్సులు ఉండవు. లబ్ధిదారులకు ఇచ్చే పత్రాలపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ఉండకూడదు.
- దేవాలయం, మసీదు, ప్రార్థనా స్థలాల్లో ప్రచారం చేయకూడదు.
- పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ప్రచారం నిషిద్ధం. ఓటింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారం, బహిరంగసభలపై నిషేధం.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే ప్రచారం చేయాలి.
- నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు ఉంటాయి.
- పార్టీల ర్యాలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- నామినేషన్‌నూ ఆన్‌లైన్‌లోనూ వేసుకొనే వెసులుబాటు ఉంది.
- అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షలు ఖర్చు చేసేందుకు అవకాశం ఉన్నది.
- నామినేషన్ కోసం ఓసీ, ఓబీసీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి.
- నామినేషన్ దాఖలులో భాగంగా గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసే నియోజకవర్గానికి సంబంధించిన ఒక ఓటరు ప్రతిపాదకుడిగా ఉంటే సరిపోతుంది.
- స్టార్ క్యాంపెయినర్లుగా రాష్ట్రంలో జాతీయ, ప్రాంతీయ పార్టీలు 40 మంది నాయకుల పేర్లను, రిజిస్టర్డ్ పార్టీలు 20 మందిని నియమించుకునే అవకాశం కల్పించారు.
- మ్యానిఫెస్టోను తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో ఎన్నికల సంఘానికి సమర్పించాలి.
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు టీవీలు, పత్రికలు, బహిరంగ ప్రకటనలు, ఎఫ్ ఎంలు, సినిమాహాల్స్, సోషల్ మీడియా, వాయిస్ మెసేజ్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఇలా అన్ని రకాల ప్రకటనలకు ముందుగా అనుమతి తీసుకోవాలి.

ఎన్నికల వ్యయంపై..

అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చేసే వ్యయంపై కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీని కోసం వ్యయ పరిశీలకులు, సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, వీడియో సర్వేలైన్స్ బృందాలు, వీడియో వీవింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), జిల్లా వ్యయ పరిశీలన కమిటీ (డీఈఎంసీ)లను ఏర్పాటు చేయనున్నది. వీటితో పాటు రాష్ట్ర పోలీసులు, రాష్ట్ర ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్, ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్, సీబీఐసీ, డీఆర్ఐ, సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, కమర్షియల్ శాఖ, ఈడీ, ఎన్సీబీ, సీఐఎస్ఎఫ్, ఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, ఐటీబీపీ, ఐసీజీ, పోస్టల్, ఏఏఐ, ఆర్బీఐ, ఎస్ఎల్ బీసీ, అటవీ శాఖలు అభ్యర్థుల వ్యయంపై తనిఖీలు నిర్వహిస్తాయి.

తనిఖీల నగదుపై..

బ్యాంకుల నుంచి రూ.లక్ష, అంత కంటే ఎక్కువ డ్రా చేసినా, జమ చేసినా ఆ అకౌంట్లపై నిఘా ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రూ.10 లక్షల కంటే ఎక్కువగా డ్రా చేస్తే వారి సమాచారాన్ని ఇన్‌కం టాక్స్ శాఖ అధికారులకు తెలపాలని సూచించింది. పోలీసులు, వివిధ శాఖల అధికారులు చేసే తనిఖీల్లో దొరికిన డబ్బును క్లియర్ చేయడానికి జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేశారు. సరైన ఆధారాలు చూపితే ఆ డబ్బును తిరిగి యజమానికి ఇవ్వనున్నారు.

నోడల్ ఆఫీసర్ల కొనసాగింపు

రాష్ట్ర నోడల్ ఆఫీసర్లుగా ఏడీజీలు సంజయ్‌కుమార్‌జైన్, మహేశ్ భగవత్‌ను ఎన్నికల సంఘం కొనసాగించనున్నది. లాఅండ్‌ఆర్డర్, ఫోర్స్ డిప్లాయ్‌మెంట్, ఎన్నికల భద్రత వంటి అంశాలకు సంబంధించి నోడల్ ఆఫీసర్ సంజయ్‌కుమార్ జైన్‌ను, ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్‌గా ఏడీజీ మహేశ్ భగవత్‌ను కొనసాగించనున్నారు.

ఆ 13 నియోజకవర్గాల్లో..

రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 13 నియోజకవర్గాల్లో మినహా మిగిలిన 106 నియోజకవర్గాల్లో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు జరగనున్నది. నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన 13 నియోజకవర్గాల్లో మాత్రం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ జరుగుతుంది.

ఓటరు గుర్తింపుకార్డు లేకుంటే..

ప్రతి ఓటరు ఓటు వేసే సమయంలో ఓటరు గుర్తింపు కార్డును చూపించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. లేదంటే 12 రకాల ప్రత్యామ్నాయాల కార్డులను సూచించింది. 1) ఆధార్ కార్డు 2) ఉపాధిహామీ జాబ్ కార్డు 3) బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు జారీచేసే పాస్‌బుక్‌లు 4) హెల్త్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డు 5) డ్రైవింగ్ లైసెన్స్ 6) పాన్ కార్డు 7) నేషనల్ పాపులేషన్ రిజిస్టార్ జారీచేసే స్మార్ట్ కార్డు 8) పాస్‌పోర్టు 9) పెన్షన్ డాక్యుమెంట్ 10) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు జారీచేసే గుర్తింపు కార్డులు, 11) ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీచేసే గుర్తింపు కార్డులు 12) యూనిక్ డిసెబిలిటీ ఐడీ కార్డులు

అవసరానికంటే అదనంగా ఈవీఎంలు..

రాష్ట్రంలో బ్యాలెట్ యూనిట్లు 71,968 అందుబాటులో ఉన్నాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అవసరానికంటే 204 శాతం ఎక్కువగా ఉన్నాయని వివరించారు. కంట్రోల్ యూనిట్లు 49,692 అంటే 141 శాతం అదనం, వీవీప్యాట్లు 54,353 అంటే 154 శాతం అదనంగా ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రంలో ఓటర్లు ఇలా..

రాష్ట్రంలో ఓటర్లు	3,30,21,735
పురుషులు	1,64,31,777
మహిళలు	1,65,87,221
థర్డ్ జెండర్	2,737
దివ్యాంగ ఓటర్లు	5,28,405
18, 19 ఏండ్ల వయస్కులు	8,51,853
20-29 ఏండ్ల వయస్కులు	66,27,096
100 ఏండ్లు పైబడిన ఓటర్లు	6,292
ఎన్నారై ఓటర్లు	3,401

తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల :	ఏప్రిల్ 18
నామినేషన్‌కు చివరి తేదీ :	ఏప్రిల్ 25
నామినేషన్‌ల పరిశీలన :	ఏప్రిల్ 26
ఉపసంహరణ చివరి తేదీ :	ఏప్రిల్ 29
పోలింగ్ తేదీ :	మే 13
ఓట్ల లెక్కింపు:	జూన్ 4

మాడల్ పోలింగ్ స్టేషన్లు

మహిళలు నిర్వహించేవి	597
దివ్యాంగులు నిర్వహించేవి	119
యువత నిర్వహించేవి	119
మాడల్ పోలింగ్ స్టేషన్లు	644

పోలింగ్ సిబ్బంది

ప్రిసైడింగ్ అధికారులు	46,403
పోలింగ్ ఆఫీసర్‌లు -1	46,403
పోలింగ్ ఆఫీసర్‌లు -2	92,806
మొత్తం పోలింగ్ సిబ్బంది	1,85,612
మైక్రో అబ్జర్వర్లు	7,169

కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

- ఏప్రిల్ 15 వరకు ఓటరు దరఖాస్తుకు అవకాశం
- నగదు, మద్యం, తాయిలాల పంపిణీపై నిఘా
- జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున మాడల్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్ జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. నగదు, మద్యం, తాయిలా పంపిణీపై నిఘా పెట్టాలని సూచించారు. శనివారం సాయంత్రం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి రిటర్నింగ్ అధికారులు, జిల్లా కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అందరూ సమిష్టిగా పనిచేయాలని, అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగదు రవాణా, బ్యాంకుల నుంచి డ్రా, డిపాజిట్ చేయడంపై నిఘా పెట్టాలని చెప్పారు. తనిఖీలు చేపట్టాలని, రాజకీయ పార్టీల నగదును, ఉచిత బహుమతులు ఇవ్వాలని చూసిన వాటిని సీజ్ చేయాలని సూచించారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడేలా వ్యవహరించవద్దని చెప్పారు. జిల్లా స్థాయిలో ఎంసీసీ అమలుపై రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కొత్తగా ఓటు హక్కు కోసం ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్వరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి, నోడల్ అధికారి మహేశ్ భగవత్ తదితరులు పాల్గొన్నారు.

37 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం?

- కోడ్ నేపథ్యంలో జీవోలు ఇవ్వని ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినట్టు సమాచారం. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన జీవోలను ప్రభుత్వం బయటికి విడుదల చేయలేదని తెలిసింది. వాస్తవానికి ఈ నెల 14వ తేదీతో జీవోలు సిద్ధమయ్యాయని సమాచారం. గతంలో హామీలు పొందిన, పార్టీలో చురుగ్గా పని చేస్తున్నవారు, రాజకీయ, సామాజికవర్గాలను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఈ పదవులకు నామినేట్ చేశారని చెప్పుకుంటున్నారు. కార్పొరేషన్ పదవులు పొందినవారిలో.. పటేల్ రమేశ్‌రెడ్డి, కే శివసేనారెడ్డి, ఎన్ ప్రీతం, నూతి శ్రీకాంత్, ఎస్ అన్వేశ్‌రెడ్డి, అనిల్ ఈరవత్రి, ఎం విజయబాబు, రాయల నాగేశ్వర్‌రావు, కాసుల బాలరాజు, నేరెళ్ల శారద, బండారు శోభారాణి, సీహెచ్ జగదీశ్వర్‌రావు, జంగా రాఘవరెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, బెల్లయ్యనాయక్, ఆర్ గుర్నాథ్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, చల్ల నర్సింహారెడ్డి, మెట్టు సాయికుమార్, కొత్తకు నాగు, జనక్ ప్రసాద్, ఎండీ రియాజ్, ఎం వీరయ్య, నాయుడు సత్యనారాయణ, ఎంఏ జబ్బార్, టీ నిర్మల జగ్గారెడ్డి, రాంరెడ్డి మల్లారెడ్డి, కాల్వ సుజాత, పొదెం వీరయ్య, ఐత ప్రకాశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అలేఖ్య పుంజల, ఎన్ గిరిధర్ రెడ్డి, మన్నె సతీశ్‌కుమార్, జెరిపెటి జైపాల్, ఈ వెంకటరామిరెడ్డి, ఎంఏ ఫహీమ్‌కు కార్పొరేషన్ పదవులు దక్కినట్టు ప్రచారం జరుగుతున్నది.

ఆంధ్రుల ఓటెక్కడ?!

- తెలంగాణ, ఏపీల్లో ఒకేరోజు పోలింగ్‌తో తీవ్ర ఉత్కంఠ
- పోలింగ్‌కు ముందు వీకెండ్ ఫీవర్
- నగరంలో అంతంతేపోలింగ్ శాతం
- ఈ పరిణామం ఎవరికి కలిసొస్తుందనే దానిపై జోరుగా చర్చ

హైదరాబాద్, సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. తెలంగాణలో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికలకు ఒకే రోజు మే 13న పోలింగ్ జరగనుండడంతో హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారనే విషయం ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలేవైనా పోలింగ్ రోజును నగరవాసులు సెలవుదినంగా భావిస్తుండడంతో ఇక్కడ అతితక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంది. ఈ క్రమంలో ఒకవైపు వీకెండ్.. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, లోక్‌సభ పోలింగ్ జరగనుండడంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో స్థిరపడిన వారి ఓట్లు రెండు చోట్లా కీలకంగా మారనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలు... తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ప్రతి ఎన్నికల్లో అధిక శాతం హైదరాబాద్ ఓటర్లు నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారు. నిరుడు నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో 49 శాతం, మేడ్చల్ జిల్లాలో సుమారు 58 శాతం పోలింగ్ నమోదైంది. రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే పట్టణ నియోజకవర్గాల్లోనూ ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం అనేక అవగాహన కార్యక్రమాలు, ఏర్పాట్లు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ నేపథ్యంలో మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సరళిపై ఇప్పటి నుంచే విశ్లేషణలు మొదలయ్యాయి. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించిన షెడ్యూల్‌లో తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాలతో పాటు ఏపీలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు కూడా మే 13న పోలింగ్ తేదీగా వెల్లడించడమే ఇందుకు ప్రధాన కారణం. హైదరాబాద్ మహానగర పరిధిలో పోలింగ్‌పై ఈ పరిణామం తీవ్రప్రభావాన్ని చూపించే అవకాశం ఉన్నదని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

అత్యధికంగా మల్కాజిగిరిపైనే...

తెలంగాణ–ఏపీల్లో ఒకేరోజు పోలింగ్ ఉండటం వల్ల మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో పోలింగ్ శాతంపై అత్యధిక ప్రభావం ఉంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి. సీమాంధ్ర ప్రాంతం నుంచి ఇక్కడికొచ్చి స్థిరపడిన వాళ్లు అత్యధికంగా ఈ పార్లమెంట్ పరిధిలోనే ఉన్నారు. మల్కాజిగిరి, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలుండగా దాదాపు అన్ని ప్రాంతాల్లో సీమాంధ్ర ఓటర్లు భారీగానే ఉన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో (కొంతభాగం) కూడా వీరి ఓట్లు అధికంగానే ఉన్నాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లోనూ వీరి సంఖ్య భారీగానే ఉంది. 3 పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ ఆంధ్రుల ప్రభావం ఉండటంతో పోలింగ్ రోజు ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లోని తమ సొంత ప్రాంతాల్లో ఎక్కడ ఓటు వేసేందుకు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతుండటంతో అక్కడికి వెళ్లేందుకే ప్రాధాన్యత ఇస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు మే 13న సోమవారం పోలింగ్ జరగనుండగా... 11వ తేదీన రెండో శనివారం, ఆ తర్వాత ఆదివారం వీకెండ్ కూడా కలిసొస్తుండటంతో తమ సొంత ప్రాంతాలకు వెళ్లినట్లు ఉంటుందనే భావనతో ఏపీలో ఓటు వేసేందుకు వెళ్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏపీలో అసెంబ్లీ పోరు రసవత్తరంగా ఉండటం, తెలంగాణలో కేవలం లోక్‌సభ ఎన్నికలు మాత్రమే జరుగుతుండడంతో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఓటు హక్కు ఉన్న వారిలో ఎక్కువమంది అక్కడికే వెళతారని అంచనా వేస్తున్నారు.

- చావనైనా చస్తా.. లంచమైతే ఇవ్వను

చావనైనా చస్తా.. కానీ లంచమైతే ఇవ్వనని ఓ రైతు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురంలో శనివారం చోటుచేసుకున్నది. కాయకష్టం చేసి రూపాయి రూపాయి కూడబెట్టి నాలుగేండ్ల క్రితం కొనుగోలు చేసిన 250 గజాల ప్లాటు.. ప్రైవేట్ పట్టానా? లేక సీలింగ్ భూమినా? సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వాలని కోరితే యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం తహసీల్దార్ రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడంటూ వావిళ్ల గ్రామానికి చెందిన రైతు బంటు సైదులు ఆందోళనకు దిగాడు.

- సంస్థాన్‌నారాయణపురం

ఎప్‌సెట్ వాయిదా తప్పదా?

- ప్రవేశ పరీక్షలపై పార్లమెంట్ ఎన్నికల ప్రభావం
- త్వరలోనే నిర్ణయాన్ని వెల్లడించే చాన్స్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టీఎస్ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్) వాయిదా పడే అవకాశం ఉన్నది. మే 9, 10న ఇంజినీరింగ్, 11, 12న అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను నిర్వహిస్తామని జేఎన్‌టీయూ అధికారులు గతంలోనే షెడ్యూల్‌ను విడుదల చేశారు. శనివారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరుగనున్నది. అంటే మే 12న పోలింగ్ కేంద్రాలను పోలీసులు, అధికారులు స్వాధీనం చేసుకొంటారు. ఈ నేపథ్యంలో ఎప్‌సెట్ పరీక్షల నిర్వహణ సాధ్యమవుతుందా? లేదా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇంజినీరింగ్ పరీక్షలను సజావుగా నిర్వహించవచ్చని, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు ఆటంకం ఏర్పడుతుందన్న భావన అధికారుల్లో వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అగ్రికల్చర్, ఫార్మసీవిభాగం పరీక్షను వాయిదా వేయడమా.. ? లేదా మొత్తానికి మొత్తం పరీక్షలను వాయిదా వేయాలా..? అని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. సెంటర్ల సామర్థ్యాన్ని 30 –35వేలకు పెంచడం ద్వారా త్వరగా పరీక్షలు పూర్తిచేయాలని నిర్ణయానికి వచ్చారు. తక్కువ దరఖాస్తులొస్తే మే 11న పరీక్షలు పూర్తిచేయాలన్న అభిప్రాయం వచ్చింది. అధికంగా వస్తే మాత్రం పరీక్షలు వాయిదా వేయక తప్పనిసరి పరిస్థితులుంటాయి. పరీక్షలను ముందు జరిపితే ఎలా ఉంటుందన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమైంది. మే 8న టీఎస్ పీఎస్సీ మరో పరీక్ష ఉండటంతో ఇది వీలుపడటంలేదు. ఇదే అంశంపై ఓ ఉన్నతాధికారిని సంప్రదించగా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో చర్చించి, త్వరలోనే ఓ నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. ఎప్‌సెట్ దరఖాస్తులు లక్ష మార్కు ను దాటాయి. ఇంజినీరింగ్‌కు 82,602, అగ్రికల్చర్, ఫార్మసీకి 38,636 దరఖాస్తులొచ్చాయి.

ఐసెట్ వాయిదాపై అతిత్వరలో స్పష్టత

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఐసెట్ పరీక్షలు వాయిదాపడనున్నాయి. ఐసెట్ పరీక్షలను జూన్ 4, 5న నిర్వహిస్తామని కాకతీయ యూనివర్సిటీ అధికారులు గతంలో ప్రకటించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లలెక్కింపు కూడా జూన్ 4న జరుగనున్నది. అంటే, ఈ లెక్కన ఐసెట్ వాయిదావేయాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనిపై మంగళవారంలోపు స్పష్టత ఇస్తామని ఓ అధికారి తెలిపారు.

మేలో డిపార్టుమెంటల్ పరీక్షలు జరిగేనా?

ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల కోసం మే 13 నుంచి 21 వరకు నిర్వహించే డిపార్టుమెంటల్ పరీక్షలు జరుగుతాయా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు మే 13న జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణపై అధికారులు ఒక నిర్ణయం తీసుకొనే అవకాశం ఉన్నదని తెలిసింది.

బీఆర్ఎస్‌కు అరూరి రమేశ్ రాజీనామా

హనుమకొండ, మార్చి 16 : మాజీ ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు అరూరి రమేశ్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు శనివారం లేఖ విడుదల చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.